క్లుప్తంగా

పేదల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయం



ముత్తుకూరు: అదానీ కృష్ణపట్నం పోర్టు పరిసర ప్రాంతాల్లోని పేదల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా అదానీ ఫౌండేషన్ పనిచేస్తోందని ఆ పోర్టు అడ్మిన్ హెడ్ గణేష్‌శర్మ పేర్కొన్నారు. జిల్లా ప్రభుత్వ వైద్య కళాశాల, అపోలో ఆస్పత్రుల సహకారంతో ముత్తుకూరు, ఆర్ అండ్‌ఆర్ కాలనీలోని అదానీ చికిత్సాలయంలో శుక్రవారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని గణేష్‌శర్మ ప్రారంభించారు. సాధారణ వైద్యపరీక్షలతో పాటు కంటి వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. సుమారు 300 మందికి వైద్యసేవలు అందించారు. స్థానిక వైద్యాధికారి అనూష, వెంకటాచలం ప్రభుత్వ కంటి వైద్య నిపుణులు బాలపద్మ, ఫౌండేషన్ డాక్టర్ సుహార్సన్, అపోలో డాక్టర్ గాయత్రి పాల్గొన్నారు.

రూ.55.56 కోట్ల రుణాల మంజూరు

బుచ్చిరెడ్డిపాళెం: ది బుచ్చిరెడ్డిపాళెం కోఆపరేటివ్ అగ్రికల్చర్ క్రెడిట్ సొసైటీ బ్యాంకు ద్వారా 2022–23 ఆర్థిక సంవత్సరంలో రూ.55.56 కోట్ల రుణాలను రైతులకు మంజూరు చేసినట్లు డీసీఓ సుధాభారతి తెలిపారు. శుక్రవారం బ్యాంకును ఆమె సందర్శించారు. రుణాలు, నగదు డిపాజిట్లకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బ్యాంకులో రైతులకు సకాలంలో రుణాలను అందజేస్తున్నట్లు గుర్తించామన్నారు. రికార్డులను పరిశీలించి పక్కాగా ఉన్నట్లు గుర్తించామన్నారు. బ్యాంకు సీఈఓ సురేష్‌రెడ్డి మాట్లాడుతూ గతంతో బ్యాంకు ద్వారా కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన కమిషన్ అందజేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఆమె నగర పంచాయతీ పరిధిలోని ఐదో వార్డు సచివాలయాన్ని తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బందికి సూచనలు చేశారు. ఆమె వెంట సబ్‌డివిజన్ కోఆర్డినేటర్ ఎంపీ సుభాషిణి ఉన్నారు.

ఎలక్ట్రిక్ ట్రై సైకిళ్ల వితరణ

కొడవలూరు: మండలంలోని రేగడిచెలిక, గండవరానికి చెందిన దివ్యాంగ వలంటీర్లు కీర్తి, అంజమ్మకు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి శుక్రవారం ట్రైసైకిళ్లను వితరణ చేశారు. నార్తురాజుపాళెంలోని వీసీఆర్ అతిథిగృహ ప్రాంగణంలో గురువారం వలంటీర్లకు పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా దివ్యాంగులైన వలంటీర్లు కీర్తి, అంజమ్మ తమకు ట్రైసైకిళ్లను మంజూరు చేయాలని ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే ప్రసన్న ఎన్‌పీఎస్ఆర్ ట్రస్ట్ ద్వారా ట్రైసైకిళ్లు ఇస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు రెండు ఎలక్ట్రిక్ ట్రైసైకిళ్లను శుక్రవారం నార్తురాజుపాళెనికి పంపి డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు చేతుల మీదుగా అందజేశారు. దీంతో ఎమ్మెల్యేకు వంటీర్లు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య, నాయకులు అడపాల మోహన్‌కృష్ణ, రామిరెడ్డి రాజేష్‌రెడ్డి, నల్లావుల శ్రీనివాసులు, దేవన బోయిన శివకుమార్, అక్కుల్‌రెడ్డి, సత్యం పాల్గొన్నారు.

హోరాహోరీగా క్రికెట్ పోటీలు

మనుబోలు: మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తండ్రి దివంగత కాకాణి రమణారెడ్డి జ్ఞాపకార్థంగా కుడితిపల్లిలో నిర్వహిస్తున్న మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ హోరాహోరీగా సాగుతోంది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లలో మనుబోలు, కొమ్మలపూడి జట్లు విజయం సాధించాయి. తొలిమ్యాచ్‌లో మనుబోలు, కట్టువపల్లి జట్లు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్‌కు దిగిన మనుబోలు జట్టు నిర్ణీత ఓవర్లలో 104 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన కట్టువపల్లి జట్టు 65 పరుగులకే ఆలౌటైంది. దీంతో మనుబోలు జట్టు 39 పరుగుల తేడాతో విజయం సాధించింది. రెండో మ్యాచ్‌లో కొమ్మలపూడి జూనియర్స్, బద్దెవోలు జట్లు తలపడ్డారు. తొలుత బ్యాటింగ్‌కు దిగిన కొమ్మలపూడి జూనియర్స్ జట్టు 95 పరుగులు చేసింది. అనంతరం బద్దెవోలు జట్టు లక్ష్య సాధనలో 68 పరుగులకే ఆలౌటైంది. కొమ్మలపూడి జూనియర్స్ జట్టు 27 పరుగుల తేడాతో విజయం సాధించింది.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

విడవలూరు(కోవూరు): రైతులు యాజమాన్య పద్ధతులను తప్పనిసరిగా పాటించాలని ఏఓ వెంకటకృష్ణయ్య సూచించారు. విడవలూరుకు చెందిన రైతు దేవళ్ల శ్రీనివాసులురెడ్డి పొలంలోని కేఎన్ఎం1638 రకం నారుమడిని శుక్రవారం ఆయన పరిశీలించారు. వరిలో ఆకు ముడత, కాండం తొలుచు పురుగుల నివారణకు నారు పీకే సమయానికి వారం రోజుల ముందుగా సెంటుకు 160 గ్రాముల కార్బోఫ్యూరాన్ 34 గుళికలను వాడాలని సూచించారు. ఎండలకు నారు దెబ్బతినకుండా వీలైనన్ని ఎక్కువసార్లు నీరు పెడుతూ తీస్తూ ఉండాలన్నారు.

త్వరితగతిన గ్రంథాలయ భవన నిర్మాణం



గ్రంథాలయాన్ని పరిశీలిస్తున్న హరినారాయణన్

- కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లా కేంద్ర గ్రంథాలయ భవన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు చేపట్టామని కలెక్టర్ హరినారాయణన్ పేర్కొన్నారు. రేబాలవారి వీధిలోని జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. గ్రంథాలయ ఆవరణలో రూ.మూడు కోట్లతో చేపట్టిన భవన నిర్మాణాన్ని పరిశీలించి పనుల పురోగతిపై ఇంజినీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలను సంస్థ చైర్‌పర్సన్ శారద వివరించారు. గ్రంథాలయ భవనం పురాతనమైనది కావడం, వర్షాకాలంలో ఉరుస్తుండటంతో పాఠకులు ఇబ్బంది పడుతున్నారని, భవన నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసేందుకు సహకరించాలని కోరారు. అపరిష్కృతంగా ఉన్న పలు సమస్యలను ఆమె తెలియజేశారు. త్వరలోనే భవన నిర్మాణాన్ని పూర్తి చేయించేలా చర్యలు చేపడతామని, రోడ్డు విస్తరణలో కోల్పోయిన గ్రంథాలయ భవన నిర్మాణాలకు నష్టపరిహారాన్ని ఇప్పిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. భవన నిర్మాణ విషయమై కమిషనర్‌తో చర్చించారు. అనంతరం గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన కేంద్రంలో విద్యార్థులతో ముచ్చటించారు. గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కుమార్‌రాజా, ఏపీ ఈడబ్ల్యూఐడీసీ ఈఈ హనుమంతరావు, డీఈ సుబ్బరాయులు, తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి



కరపత్రాలను అందజేస్తున్న ఎంపీ ఆదాల

నెల్లూరు రూరల్: రూరల్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నానని ఎంపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. రూరల్ పరిధిలోని 18వ డివిజన్లో గల హరనాథపురం మూడో వీధిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన నిర్వహించారు. సంక్షేమ పథకాలకు సంబంధించి కరపత్రాలను ఇంటింటికీ వెళ్లి అందజేసి.. లబ్ధిని వివరించిన అనంతరం ఆయన మాట్లాడారు. అర్హులకు సంక్షేమ పథకాలను అందిస్తున్నామని వివరించారు. నియోజకవర్గ అభివృద్ధితో పాటు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని చెప్పారు. విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, రైల్వే బోర్డు సభ్యుడు వెంకయ్య, కార్పొరేటర్ అశోక్, శివసునీల్, తదితరులు పాల్గొన్నారు.

విద్యే ఉత్తమ ధనం



నెల్లూరు(బృందావనం): విద్యే ఉత్తమ ధనమని, జీవితాంతం అది వెంటే ఉంటుందని కవి, పండితుడు శిరోమణిశర్మ పేర్కొన్నారు. శెట్టిగుంట రోడ్డులోని వీవర్స్ కాలనీలో గల పట్టాభిరామస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న బాలరామాయణం, నామరామాయణం, అన్నమయ్య సంకీర్తనాలాపనల సప్తాహం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆయన ఉపన్యసించారు. నామరామాయణంపై సాధన చేయించారు. శ్రీనివాసులురెడ్డి, దేవస్థాన ప్రధానార్చకుడు కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): రైతుబజార్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ బోడిగాడితోట ఫీడర్‌లో రోడ్డును విస్తరించిన ప్రాంతాల్లో విద్యుత్ లైన్లను ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో పలు ప్రాంతాల్లో సరఫరా శనివారం ఉండదని టౌన్ – 2 డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మధుసూదన్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బోడిగాడితోట, వైకుంఠపురం, తదితర ప్రాంతాల్లో ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు.

- ఎంజీనగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ డీకే డబ్ల్యూ ఫీడర్‌లో మరమ్మతులు, తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించనున్న కారణంగా అంబేడ్కర్‌నగర్, ప్రశాంతినగర్, నీలగిరిసంఘం, నూతన ఎస్పీ కార్యాలయం, కేవీఆర్ పెట్రోల్ బంక్, తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 1.30 వరకు సరఫరా ఉండదని ఐఈ సెక్షన్ ఏఈ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు.
- రాజేంద్రనగర్ సబ్‌స్టేషన్ పరిధిలో 11 కేవీ విద్యుత్ లైన్లను ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో మహేశ్వరినగర్, శివగిరికాలనీ, వాకర్స్‌రోడ్డు, నవబాల దుర్గాదేవి ఆలయం, రాజీవ్ గృహ కల్ప, పుత్తా ఎస్టేట్స్, న్యూ పోలీస్ కాలనీ, మస్తానమ్మ లేఅవుట్, తదితర ప్రాంతాల్లో ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని వెస్ట్ – 2 సెక్షన్ ఏఈ గోపీ తెలిపారు.

భక్తులకు మజ్జిగ పంపిణీ



నెల్లూరు(బృందావనం): నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం వద్ద భక్తులు, తదితరులకు మజ్జిగను జీఆర్ ఉమెన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం పంపిణీ చేశారు. సభ్యులు వరమ్మ, అరుణ, శైలజ, పద్మావతిదేవి, రమాదేవి, పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

నేమ్ బోర్డుల ఏర్పాటుకు చర్యలు



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని 14వ డివిజన్లో వీధులను గుర్తించేలా నేమ్ బోర్డులను ఏర్పాటు చేయనున్నామని కార్పొరేటర్ ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. ఉషోదయాన వీధివీధికీ మీ కర్తం కార్యక్రమంలో భాగంగా పలు ప్రాంతా లను శుక్రవారం ఆయన సందర్శించారు. సమస్యలను తనకు తెలియజేస్తే నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు.

29న తెలుగు భాషోద్యమ సమాఖ్య మహాసభ

నెల్లూరు(బృందావనం): తెలుగు భాషోద్యమ సమాఖ్య మహాసభను పురమందిర ప్రాంగణంలోని ఏసీ హాల్లో సోమవారం నిర్వహించనున్నామని రచయితల సంఘ జిల్లా అధ్యక్షుడు జయప్రకాష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు భాషాభిమానులు, రచయితలు, కవులు, సాహితీవేత్తలు హాజరుకావాలని కోరారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

నెల్లూరు(బారకాసు): పీఎంపీలు నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని శేషు స్కూల్ వ్యవస్థాపకుడు ఆదిశేషు పేర్కొన్నారు. బుజబుజనెల్లూరులోని శేషు ఇంగ్లిష్ మీడియం స్కూల్ ఆవరణలో ఉచిత వైద్య శిబిరాన్ని ఎనెల్ హాస్పిటల్, పీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. పలువురికి వైద్య పరీక్షలు చేసి మందులను అందజేశారు. పీఎంపీ గౌరవాధ్యక్షుడు జయప్రకాష్, జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, విశ్రాంత ఏఎస్పై మహబూబ్‌బాషా, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

సమ్మర్ యాక్టివిటీస్ పరిశీలన

కొడవలూరు: గండవరం జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థుల సమ్మర్ యాక్టివిటీస్‌ను ఆ పాఠశాల హిందీ పండిట్ జీ నాగభూషణం శుక్రవారం వారి ఇళ్లకు వెళ్లి పరిశీలించారు. వేసవి సెలవుల్లోనూ విద్యార్థుల అభ్యాసన కుంటు పడకూడదనే ఉద్దేశంతో రాష్ట్ర విద్యాశాఖ సమ్మర్ యాక్టివిటీస్ అనే వినూత్న కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది. అందులో భాగంగా ప్రతి తరగతికి ఒక వాట్సాప్ గ్రూపు రూపొందించి అందులో విద్యార్థులు, ఉపాధ్యాయులను చేర్చాలి. ఉపాధ్యాయులు వాట్సప్ ద్వారా పంపే విషయాలను విద్యార్థులు ప్రత్యేక నోట్ పుస్తకంలో నోట్ చేసుకోవాలి. ఈ నోట్సులను పాఠశాలలు ప్రారంభం రోజున ఉపాధ్యాయులు విధిగా పరిశీలించాలని విద్యాశాఖ ఆదేశించింది. అందులో భాగంగా హిందీ పండిట్ విద్యార్థుల నోట్స్‌ను పరిశీలించారు. వారు రూపొందించిన కృత్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్ పర్సన్ రహ్మతున్నీసా, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిపై ఫిర్యాదు

విడవలూరు(కోవూరు): విడవలూరు మండలం ముదివర్తి పంచాయతీ పరిధిలో ఎన్ఆర్ఈజీఎస్ క్రింద 2017లో తాను నిర్మించిన సీసీ రోడ్డుకు సంబంధించి మంజూరైన బిల్లును పంచాయతీ కార్యదర్శి అచ్చయ్య తనకు ఇవ్వకుండానే ఖర్చు చేసేశాడని కాంట్రాక్టర్ కొండూరు లక్ష్మీనారాయణరెడ్డి ఆరోపించారు. ఈ మేరకు జిల్లా కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఎన్ఆర్ఈజీఎస్ పనుల క్రింద తాను చేపట్టిన సీసీరోడ్ల నిర్మాణ పనులకు సంబంధించి రూ.1.10 లక్షలను ఈ ఏడాది జనవరి 6న ముదివర్తి పంచాయతీ ఖాతాలో ప్రభుత్వం జమచేసిందని తెలిపారు. అయితే ఫిబ్రవరి 28న పంచాయతీ ఖాతా నుంచి నగదు డ్రా చేసిన కార్యదర్శి తనకివ్వకుండా ఇతర పంచాయతీ అవసరాలకు ఖర్చుచేశాడని చెప్పారు. ఈ విషయమై పంచాయతీకార్యదర్శిని పలుమార్లు అడిగినా సమాధానం చెప్పలేదని ఆరోపించారు. అధికారులు చొరవ చూపి తన బిల్లును తనకు ఇప్పించాలని కోరారు.





కమ్మేసిన దుమ్ము

నగరంలో ఒక్కసారిగా శుక్రవారం భారీ గాలులు వీచాయి. దీంతో చిల్డ్రన్స్ పార్కు, తదితర ప్రాంతాల్లో దుమ్ము లేచింది. దీంతో అటుగా వెళ్లే పాదచారులు, వాహనచోదకులు ఇబ్బంది పడ్డారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

వలంటీర్ల సేవలు ప్రశంసనీయం



వలంటీర్‌ను సత్కరిస్తున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి

- ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు సజావుగా అందిస్తున్న వలంటీర్ల సేవలను ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి కొనియాడారు. 20వ డివిజన్లోని కొండాయపాళెం సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నవరత్నాలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నారని, వీటిని ప్రజల్లోకి తీసుకెళ్లే విషయంలో వలంటీర్లు, సచివాలయాల సిబ్బంది కృషి చేయాలని పిలుపునిచ్చారు. వలంటీర్లు నిబద్ధతతో వ్యవహరిస్తుండటంతో ప్రభుత్వానికి ప్రజల్లో మంచి పేరొస్తోందని చెప్పారు. రానున్న ఎన్నికల్లోనూ సీఎంను ప్రజలు ఆదరించాలని కోరారు. అనంతరం వలంటీర్లను సత్కరించారు. విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, నేతలు శ్రీనివాసరావు, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో కమిషనర్ తనిఖీలు



నెల్లూరు(బారకాసు): హరనాథపురం, పీపుల్స్ పార్క్ సమీపంలోని వార్డు సచివాలయాలను కమిషనర్ వికాస్ మర్మత్ ఆకస్మికంగా శుక్రవారం తనిఖీ చేశారు. సచివాలయాల్లోని ఇన్‌స్పెక్షన్, స్పందన రిజిస్టర్లు, నోటీస్ బోర్డు, హాజరు, వివిధ సంక్షేమ పథకాల రికార్డులను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న సేవలను గడువులోపు పూర్తి చేయాలని సూచించారు. ఎస్డీజీ, భూహక్కు సర్వే, ఏపీ సేవా పోర్టల్ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి కార్యాచరణ ప్రణాళికను అమలు చేయాలని ఆదేశించారు. ఆస్తి పన్ను, యూజర్ చార్జీల వసూళ్లను వేగవంతం చేయాలని సూచించారు. జగనన్న కాలనీల్లో నిర్మాణ పనులను క్రమం తప్పకుండా పర్యవేక్షించాల్సిందిగా అమెనిటీస్ కార్యదర్శులను ఆదేశించారు. అనంతరం మాగుంట లేఅవుట్లోని వెంకటేశ్వరస్వామి దేవస్థాన ఎదురుగా గల కాలువలో పేరుకుపోయిన తుంగను తొలగించాలనే స్పందన ఫిర్యాదును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇంజినీరింగ్ విభాగ ఈఈ శేషగిరిరావు, ఏఈ ఫాజిల్, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం



సైకిల్ ర్యాలీని ప్రారంభిస్తున్న వికాస్ మర్మత్



ర్యాలీలో ఉత్సాహంగా విద్యార్థులు

- కమిషనర్ వికాస్ మర్మత్
- ఉత్సాహంగా సైకిల్ ర్యాలీ

నెల్లూరు(బారకాసు): పర్యావరణాన్ని పరిరక్షించి.. రాబోయే తరాలకు ఆరోగ్యకరమైన భవిష్యత్తును అందించాలని కమిషనర్ వికాస్ మర్మత్ కాంక్షించారు. పర్యావరణహిత జీవన శైలిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు గానూ నగరంలో సైకిల్ ర్యాలీని నగరపాలక సంస్థ, ఏపీ కాలుష్య నియంత్రణ మండలి, గ్రామ, వార్డు సచివాలయ విభాగాల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. గాంధీబొమ్మ సెంటర్‌లో సైకిల్ ర్యాలీని ప్రారంభించిన అనంతరం కమిషనర్ మాట్లాడారు. ప్లాస్టిక్ ఉత్పత్తుల వినియోగంపై నియంత్రణతో పాటు జౌళి సంచులను వాడాలని కోరారు. పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు గానూ ర్యాలీలు, నడక పోటీలు, మారథాన్, తదితర కార్యక్రమాలను క్రమం తప్పకుండా అమలు చేయనున్నామని చెప్పారు. అనంతరం ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం వరకు ర్యాలీ సాగింది.

మాదకద్రవ్యాలకు బానిసలు కావొద్దు



మాట్లాడుతున్న కిషోర్

నెల్లూరు (టౌన్): యువత మాదకద్రవ్యాలకు బానిసలు కావొద్దని ఎస్ఈబీ సీఐ కిషోర్ పేర్కొన్నారు. దిశ చట్టం, మాదకద్రవ్యాల వినియోగంతో సంభవించే దుష్పరిణామాలపై అవగాహన సదస్సును వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ బాలుర ఐటీఐలో యువజన సంక్షేమ శాఖ, సెట్నెల్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మత్తు పదార్థాలు సేవించినా.. కలిగి ఉన్నా జైలు శిక్ష పడే అవకాశం ఉందని చెప్పారు. మెడికల్ అధికారి భాస్కర్‌రావు, సెట్నెల్ సీఈఓ పుల్లయ్య, ప్రిన్సిపల్ శ్రీధర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యమివ్వాలని వినతి



సజ్జల రామకృష్ణారెడ్డికి వినతిపత్రమిస్తున్న నేతలు

నెల్లూరు (వేదాయపాళెం): నామినేటెడ్ పదవుల్లో మాదిగలకు తగిన ప్రాధాన్యం కల్పించాలని సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సుబ్బయ్య కోరారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి అమరావతితో వినతిపత్రాన్ని శుక్రవారం అందజేశారు. ఎస్టీ, ఎస్సీ, బీసీ మైనార్టీ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీనివాసులు, ఎమ్మార్పీఎస్ నేతలు వెంకట్రావు, చిన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం



నిప్పో సెంటర్‌లో..



రైల్వేస్టేషన్ సమీపంలో..

నెల్లూరు రూరల్: నిప్పో సెంటర్‌లోని సత్యసేవా వృద్ధాశ్రమంలో అన్నదానాన్ని మాధవ్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు మాధవ్ మాట్లాడారు. ఇక నుంచి సేవా కార్యక్రమాలను ప్రతినెలా నిర్వహించనున్నామని చెప్పారు.

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని రైల్వేస్టేషన్ వద్ద అనాథలు, నిరాశ్రయులు, వృద్ధులు, దివ్యాంగులకు అన్నదానాన్ని నిర్వహించారు. జనార్దన్‌రెడ్డికాలనీలోని మౌలాలీ ముష్కిల్‌కుషా మకాన్ దర్గా ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని చేపట్టారు. నిర్వాహకుడు కరిముల్లా, ఫయాజ్, అర్షద్, షఫీ, సందానీ, ఖాదర్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.